క్లుప్తంగా...

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

ఘట్‌కేసర్: హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం గీతామందిర్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ మద్భగవద్గీత భక్త సమాజం సభ్యుడు ఆత్మారాం శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థికి నేతల అభినందనలు



కీసర: ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో నాగారం మున్సిపాలిటీకి చెందిన ప్రసాద్ కూతురు ఎం.లక్ష్మీహాసిని ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించింది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు గూడూరు అంజన్న తదితరులు విద్యార్థిని శనివారం అభినందించి సత్కరించారు. ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పురుషోత్తం, నూనే శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

మేడ్చల్: మరోసారి మోదీ సర్కార్..తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం పేరుతో బీజేపీ చేపట్టిన ఇంటింటికి కమలం కార్యక్రమాన్ని పట్టణ బీజేపీ నాయకులు మేడ్చల్ లో నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రేందాస్ పాల్గొన్నారు.

అత్వెల్లి లో హెల్త్ మేళా



మెడికల్ కిట్ అందజేస్తున్న కౌన్సిలర్ దేవరాజ్

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ మేళాను నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ జాకట దేవరాజ్ మేళాను ప్రారంభించారు. తల్లులకు, గర్భిణీలకు ఆయన హెల్త్ క్యాంపు సందర్భంగా ప్రభుత్వం అందజేసిన మెడికల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



కీసర: కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో బాణాసంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రూ.18లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ రాములు, స్థానిక కౌన్సిలర్ దొడ్ల మల్లిఖార్జున్ ముదిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కీసర: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీర్యాల సాయినగర్ సమీపంలో చోటుచేసుకుంది. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన మేరకు.. నాగారం మున్సిపాలిటీ ఆర్‌ఎల్‌నగర్‌లో నివాసముంటున్న కోటేశ్వరరావు(45)తాపీ మేస్త్రి పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కోటేశ్వరరావుకు ఆర్థిక సమస్యలు ఎక్కువయ్యాయి. గత శనివారం సొంత ఊరికి వెళ్లిన కోటేశ్వరరావు వారం రోజుల తరువాత చీర్యాల సమీపంలోగల సాయినగర్‌కాలనీ వెనకవైపు నిర్మానుష్యమైన ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు.

నిధుల ఖర్చుకూ బద్ధకమే..!

- ఐదుగురు ఎమ్మెల్యేలకు 2021-22లో రావాల్సిన సీడీపీ నిధులు 15 కోట్లు
- ప్రభుత్వం కేటాయించింది రూ. 9.36 కోట్లు
- వివిధ అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు రూ. 3.39 కోట్లు
- 2022-23లోనూ రూ.7.06 కోట్ల కేటాయింపు - ఖర్చు చేసింది సున్నా

అభివృద్ధి పనులకు నిధులు ఖర్చుచేయని ఎమ్మెల్యేలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఎమ్మెల్యేకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తుంది. ప్రభుత్వం కేటాయించిన నిధులతో తమ నియోజకవర్గాల్లో పనులు చేయించాలి. అయితే కొందరు ఎమ్మెల్యేలు మాత్రం వాటిని వినియోగించడంపై శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వం ఏటా ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రూ.5 కోట్లు విడుదల చేస్తోంది.

40 శాతం నిధులు ప్రభుత్వ బడులకే ...

నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఎమ్మెల్యేలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల్లో 40 శాతం నిధులను నేరుగా మన ఊరు- మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేటాయిస్తున్నారు. ఇక మిగతా 80 శాతం నిధులు ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు తీర్చేందుకు వినియోగించాల్సి ఉంటుంది. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలతో పాటు ప్రజలకు అవరమయ్యే ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఖర్చు చేయాల్సి ఉంది.

నియోజకవర్గం అభివృద్ధి నిధుల ఖర్చు ఇలా

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద 2021-22 సంవత్సరంలో ప్రభుత్వం ఐదుగురు ఎమ్మెల్యేలకు రూ.15 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.936.46 లక్షలు నిధులను 234 అభివృద్ధి పనులకు కేటాయించారు. వాటిలో113 పనులు పూర్తి కాగా, ఇంకా 121 పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

మంత్రి నియోజకవర్గంలో కేవలం 74 లక్షలే ఖర్చు



సీహెచ్ మల్లారెడ్డి

మేడ్చల్‌లో సీడీపీ కింద 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే మంత్రి సీహెచ్ మల్లారెడ్డికి ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.248 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.74.31 లక్షలకు సంబంధించిన పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా రూ.173.69 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

మల్కాజిగిరిలో సున్నా..



మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేయగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.265.50 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది.

ఉప్పల్‌లో అంతంతే..



సుభాష్‌రెడ్డి

ఉప్పల్‌లో సీడీపీ కింద 2021-22లో ఎమ్మెల్యే బి.సుభాష్‌రెడ్డికి ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేయగా వివిధ పనులకు రూ.241.74 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు రూ.98.03 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగతా రూ.143.71 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

కుత్బుల్లాపూర్‌లో ఇలా..



కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్‌లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయగా వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.247.50 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు రూ.128.40 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరో రూ.36.79 లక్షలతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. మిగతా రూ.82.31 లక్షలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పూర్తి కావాల్సింది.

కూకట్‌పల్లిలో ఒక్కటీ పూర్తి కాలే..



మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయగా వివిధ పనుల కోసం రూ.246 లక్షలు కేటాయించారు. అందులో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా పూర్తి కాలేదు. ఎమ్మెల్యే అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు జాప్యంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలకు నిధులు విడుదలై ఏడాది గడిచినా వాటి వినియోగంలో జాప్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అన్ని చోట్లా... ఇంకా వెయిటింగే..

2022-23 సంవత్సరానికి గాను జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి రూ.15 కోట్లకు గానూ ప్రభుత్వం సీడీపీ కింద 706.55 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో 165 పనులకు ఆమోదం లభించింది. అయినా.. ఇప్పటి వరకు ఒక్క పని కూడా పూర్తి కాలేదు. 2022-23లో మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి రూ.149.85 లక్షలు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ రూ. 117 లక్షలు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు రూ. 268 లక్షలు, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి రూ.171.70 లక్షల నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు.

ఘనంగా కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠాపన



పోచారం: అన్నోజిగూడలో కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గత మూడు రోజులుగా జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం విగ్రహాన్ని ప్రతిష్ఠించి, కాటమయ్య కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితర అతిథులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సర్దార్ సర్వాయి పాపన్న సేవలు మరువలేనివి

నేరేడ్‌మెట్ : గౌడ సేన ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే వివేక్‌గౌడ్‌లు హాజరై విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో అజయ్యగౌడ్, కార్పొరేటర్‌లు మీనా ఉపేందర్‌రెడ్డి, ప్రేమకుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హబ్సిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి శనివారం చెక్కులు అందించారు. లబ్ధిదారులు రవీందర్, సాంబచారి, జెకోడి శ్రీనోస్సం, మైత్రి, రమేష్, మహేష్, రామలింగం, మౌనిక, స్వప్న, శ్రీలత, లక్ష్మీదుర్గాదేవికి ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అందించారు. బీఆర్‌ఎస్ నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, నర్సింగరావు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి: హనుమాన్ జయంతి సందర్భంగా ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని సంకట విమోచన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఫలరహిత సహిత పంచామృతాభిషేకము, ఫల పుష్ప అలంకరణ, సింధూర పూజ, వస్త్ర సేవ జరుగుతుందని ఈవో రవీందర్‌రెడ్డి, అర్చకులు తులసి రమణాచార్యులు తెలిపారు.

18న రైల్వేగేటు వద్ద సమావేశం



ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న కొండాపూర్ రైల్వే వంతెన సమస్య పరిష్కారానికి ఈ నెల 18న రైల్వే గేటు వద్దే సమావేశం నిర్వహిస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మున్సిపల్ ఆత్మీయ సమ్మెళనానికి, చైర్ పర్సన్ పావనీజంగయ్యతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలని ఇంగ్లీష్ మీడియంలో గురుకులాలు ప్రారంభించామని, ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులను అభివృద్ధి చేసిన ఘనత దేశంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కొండాపూర్ రైల్వే వంతెన పరిష్కారం కోసం రూ. 9 కోట్లు కోర్టులో జమాఉందని, కాంట్రాక్టర్‌కు పెండింగ్ డబ్బులు కూడ చెల్లించమన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిచాలి

మల్లాపూర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాచారం మహంకాళి దేవాలయం ప్రధాన అర్చకులు వేదాంతం నరసింహామూర్తి అన్నారు. జన్మదిన సందర్భంగా దేవాలయంలో మొక్కలను నాటారు. బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, పోగుల వెంకటరమణారెడ్డి, గద్ద యుగేందర్, పాండురంగంగౌడ్ పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేత



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌లోని సాయి బాబా దేవాలయం మండపం పాలరాతి నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ రూ. లక్ష ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్య క్రమంలో మల్లేష్‌యాదవ్, విఠల్ యాదవ్, సీఎస్.మల్లేష్, హరికృష్ణ, హరి కృష్ణ రెడ్డి, పాల్గొన్నారు.

'సూపర్‌మ్యాక్స్' కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం



కార్మికులకు మద్దతుగా దీక్షలో భరతసింహారెడ్డి

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు న్యాయం జరిగే వరకు వారికి తోడుగా ఉంటానని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు పరిశ్రమ యాజమాన్యం జీతాలు చెల్లించాలని 76 రోజులుగా ధర్నా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న భరతసింహారెడ్డి శనివారం దీక్షా శిబిరానికి వచ్చి కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడుతూ... న్యాయం జరిగే వరకు మీ వెంటే ఉంటానని స్పష్టం చేశారు. ఇకనైనా పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయని సందర్భంలో న్యాయపరంగా కొట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన యాజమన్యాన్ని హెచ్చరించారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన మేయర్


బోడుప్పల్: రాజీవ్‌నగర్‌కాలనీలో పేద ప్రజల కోసం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను శనివారం మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వాణిరెడ్డి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉన్నాయ లేదా అని పరిశీలించినట్లు వెల్లడించారు. పాడైన చోట మరమ్మతులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



జవహర్‌నగర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీలతో విజయకేతనం ఎగురవేయడంతో కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బాలాజీనగర్‌లో టపాకాయలు కాల్చి, భారీ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు మాట్ల వినమ్‌కుమార్, సీనియర్ నాయకులు రజితగోపాల్, సుగుణ పాల్గొన్నారు.


యువతి అదృశ్యం



స్వర్ణలత (ఫైల్)

జవహర్‌నగర్: ఇంటి నుండి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన మేరకు.. జవహర్‌నగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన స్వర్ణలత (20) స్నేహితుల ఇంటికి వెళ్తున్నానంటూ శుక్రవారం ఉదయం బయటకు వెళ్లింది. ఆ తరువాత తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం సమీప ప్రాంతాలలో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి రాధా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధి కట్ట మైసమ్మ ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయం సమీపంలో ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరుపగా గుడి ఆవరణలో బిక్షాటన చేసే వాడిని ప్రాథమిక విచారణలో తెలిసింది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్

అల్వాల్: రానున్న ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా శనివారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఇంటింటికి తిరగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులు ఉద్యోగాలు, 500 వందలకే వంటగ్యాస్ ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. యాత్ర ప్రారంభించి 50 రోజులు అయినందున కేక్ కటింగ్ చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచినందుకు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలపై దృష్టి సారించాలి

రామంతాపూర్: జాతీయ మైనార్టీ కమీషన్ సభ్యురాలు సయ్యద్ షహేజాది రామంతాపూర్‌లో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ నివాసం వద్ద ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మేధావులు, మసీద్ కమీటీ సభ్యులు, ముతవల్లీలతో ముఖముఖీ సమావేశమయ్యారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డ్, ప్రాపర్టీలు అన్యక్రాంత, మైనార్టీలలో పెరుగుతున్న పేదరికం, పాఠశాలల డ్రాప్ అవుట్స్, మదర సాల, కంప్యూటీకరణ, ఆధునీకరణ, మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి పథకాలు అమలు వంటివి జాతీయ కమీషన్ సభ్యురాలి దృష్టికి తీసుకువచ్చారు. మైనార్టీ నాయకులు అన్సారీ, యూసఫ్. అన్వర్, ఏజాజ్, జూబేదా, జాకీర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హోం మంత్రి అభినందన



అల్వాల్: పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన అల్వాల్‌కు చెందిన త్రివేణి విద్యార్థులను హోం మంత్రి మహమూద్‌ఆలి అభినందించారు. 10వ తరగతి ఫలితాలలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులు సాయి భవ్యశ్రీ, కీర్తి, మనోజ్ఞలతోపాటు 9.7 సాధించిన ఐశ్వర్య, 9.5 సాధించిన హాసిని, లాస్యరెడ్డిలు, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో శనివారం హోం మంత్రి మహమూద్ ఆలీని కలిశారు.

హైమాస్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ చౌరస్తాలో -చర్లపల్లి ప్రధాన రహదారిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రూ. 8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఎలక్ట్రికల్ డీఈ రవీంద్ర, ఏఈ ప్రత్యూష పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



కుషాయిగూడ: పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో తలపెట్టిన బీఎల్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం చర్లపల్లిలోని వివి ఎరేనా క్రికెట్ గ్రౌండ్‌లో చర్లపల్లి జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్‌తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చేయూత

మల్కాజిగిరి: పేద విద్యార్థికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేయూత నందించారు.ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన బాలసాయి అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని నెలల క్రితం అతని ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో స్థానిక ఎమ్మెల్యే పరామర్శించారు. అతని పిల్లల చదువు కోసం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆర్థిక సహాయం చెక్ అందజేశారు.

స్వయం ఉపాధి పథకాలపై దృష్టి సారించాలి

రామంతాపూర్: జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహేజాది రామంతాపూర్‌లో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ నివాసం వద్ద ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మేధావులు, మసీద్ కమిటీ సభ్యులు, ముతవల్లీలతో ముఖముఖీ సమావేశమయ్యారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డ్, ప్రాపర్టీలు అన్యక్రాంత, మైనార్టీలలో పెరుగుతున్న పేదరికం, పాఠశాలల డ్రాప్ అవుట్స్, మదర్సాల కంప్యూటీకరణ, ఆధునీకరణ, మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి పథకాలు అమలు వంటివి జాతీయ కమిషన్ సభ్యురాలి దృష్టికి తీసుకువచ్చారు. మైనార్టీ నాయకులు అన్సారీ, యూసఫ్. అన్వర్, ఏజాజ్, జూబేదా పాల్గొన్నారు.